క్లుప్తంగా

డీజీపీ శివధర్‌రెడ్డికి సన్మానం


డీజీపీని సన్మానిస్తున్న జైపాల్‌రెడ్డి

తుక్కుగూడ: ఇటీవల రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన శివధర్‌రెడ్డికి రావిర్యాల మాజీ ఉపసర్పంచ్ బోధ జైపాల్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఆయన రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.

మౌలిక వసతులు కల్పించని పాఠశాలలపై చర్యలు

ఎంఈఓ కస్నానాయక్


విద్యార్థులతో మాట్లాడుతున్న కస్నా నాయక్

మహేశ్వరం: విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి కస్నానాయక్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని కొళ్లపడకల్‌లో శ్రీరామచంద్ర విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో సరైన వసతులు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆట స్థలం, క్రీడా వస్తువులు లేవని చెప్పారు. ఇరుకైన తరగతి గదుల్లో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థులకు సరిపడ టాయిలెట్స్ లేవన్నారు. పాఠశాల సందర్శించిన సమయంలో ప్రిన్సిపాల్ అందుబాటులో లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టండి

బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: కృష్ణా వాటర్ పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ నేతలతో కలిసి కమిషనర్ సరస్వతిని కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడంగ్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కృష్ణావాటర్ సంప్ ఉందని.. ఇక్కడ నీరు సరఫరా అవుతున్న పైప్‌లైన్లకు రంధ్రాలు ఏర్పడడంతో విద్యార్థులు అక్కడ ప్లేట్లు శుభ్రం చేస్తున్నారని చెప్పారు. శుభ్రం చేసిన నీరు నేరుగా సరఫరా చేస్తున్నారని వివరించారు. పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి ట్యాంకులు శుభ్రం చేసిన తర్వాతే నీటి సరఫరా చేపట్టాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పార్టీ నేతలు మురళీధర్‌రెడ్డి, కిరణ్‌రాజ్ తదితరులున్నారు.

రోడ్లకు మరమ్మతులు


ఆర్సీఐ రూట్‌లో రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పహాడీషరీఫ్: ఆర్సీఐ రోటరీ దగ్గర ప్రధాన రహదారి గోతులమయంగా మారి నిత్యం ట్రాఫిక్ స్తంభించి పోతుండడంతో మహేశ్వరం ట్రాఫిక్ పోలీసులు స్వయంగా మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్సై పాండ్‌ల నేతృత్వంలో గోతులలో కాంక్రీట్ పోయించి వాహనాలు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. శ్రీశైలం వెళ్లే ప్రధాన రూట్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో రోడ్లు దెబ్బతిని, చిన్న చిన్న గోతుల కారణంగా వాహనదారులు సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేని ప్రాంతాలలో ఇలాంటి మరమ్మతులు చేయిస్తున్నామన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ముద్వీన్ గ్రామానికి చెందిన దాదాపు 25 మంది బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.


చెరువులో కలుస్తున్న బడంగ్‌పేట మురుగునీరు


అల్మాస్‌గూడ నుంచి వచ్చే మురుగు

పెద్ద చెరువు మురుగుమయం

ట్రంక్‌లైన్ ద్వారా నేరుగా చేరుతున్న డ్రైనేజీ నీరు

- మృత్యువాత పడుతున్న చేపపిల్లలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

మీర్‌పేట: ఓ వైపు సుందరీకరణ.. మరోవైపు తటాకమంతా మురుగుమయం కావడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద చెరువు సుందరీకరణ కోసం ప్రభుత్వం గతంలో నిధులు మంజూరు చేసింది. కొంత వరకు అభివృద్ధి చేయడంతో పాటు మురుగునీరు చెరువులో చేరకుండా ప్రత్యేకంగా ట్రంక్‌లైన్‌ను కూడా నిర్మించారు. దీంతో రెండేళ్లుగా చెరువులోకి దాదాపు వర్షపునీరే ఎక్కువగా చేరడంతో కాలుష్యం తగ్గుముఖం పట్టింది. మత్స్య సొసైటీ సభ్యులు సైతం చేప పిల్లలను వదిలి చేపలు పట్టడం ప్రారంభించారు. ఇదిలా ఉండగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పైనున్న అల్మాస్‌గూడ, బడంగ్‌పేట ప్రాంతాల నుంచి వరదతో పాటు మురుగునీటిని కూడా చెరువులోకి వస్తోంది. 20 రోజులుగా ట్రంక్ లైన్ నుంచి నేరుగా డ్రైనేజీని మళ్లించడంతో చెరువు అంతా పూర్తిగా మురికి కూపంగా మారిపోయింది. ప్రస్తుతం తటాకం ప్రాంతమంతా దుర్వాసన వ్యాపించడంతో వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని సమీప కాలనీలవాసులు పేర్కొంటున్నారు.

భారీ వర్షాలకు..

బడంగ్‌పేట, అల్మాస్‌గూడ ప్రాంతాల నుంచి ట్రంక్ లైన్ ద్వారా బయటకు వెళ్లాల్సిన మురుగునీరు నేరుగా చెరువులోకి కలుస్తున్నా మీర్‌పేట మున్సిపల్ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. నెల రోజులుగా కురిసిన భారీ వర్షాలకు వర్షపునీటితో కళకళలాడిన చెరువు కొన్ని రోజుల్లోనే మురుగుమయం కావడంపై స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సుందరీకరణ లక్ష్యం నీరు గారుతున్నా, చెరువులో మురుగునీరు చేరడంతో ఇటీవల చేపలు సైతం మృత్యువాత పడినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంపై ప్రజలు మండిపడుతున్నారు.

మురుగు కలవొద్దు



చెరువులో డ్రైనేజీ నీరు చేరడంతో కొన్ని రోజులుగా దుర్వాసన వస్తుండడంతో సమీప కాలనీలవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కోట్లాది రూపాయలతో ట్రంక్‌లైన్ నిర్మించినా ప్రయోజనం లేకుండా పోతుంది. ఇప్పటికైనా చెరువులో మురుగునీరు చేరకుండా కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– భిక్షపతిచారి, బీజేపీ మీర్‌పేట అధ్యక్షుడు

రిజర్వేషన్లపై కోర్టు స్టే సరికాదు



మాట్లాడుతున్న పురుషోత్తం

ఎస్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం

బడంగ్‌పేట్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కోర్టు స్టే విధించడం సరి కాదని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎస్పీఐ) యునైటెడ్ తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బొద్రమోని పురుషోత్తం అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీబీ భవన్‌లో ఇంద్రాల శేఖర్‌కుమార్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన సమర్థించారు. సుదీర్ఘ పోరాటం తర్వాత స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడం ఒకవైపు ఆనందంగా ఉన్నా మరో వైపు జీవో 9పై కోర్టు స్టే విధించడం బాధగా ఉందన్నారు. బహుజన సమాజాన్ని అణచివేసేందుకు అగ్రవర్ణాల కుట్రలో భాగమే హైకోర్టు తీర్పు అని ఆరోపించారు. ఈ కుట్రలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా బహుజన శ్రామిక వర్గాలతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. బీసీలంతా ఒక్కతాటిపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి గోవింద్‌నాయక్, ఏఐడబ్ల్యూటీయూ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఝాన్సీ, ఏఐడీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుజాత, ఏఐడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రసాద్, పి.సురేశ్, జి.కృష్ణ, రాజు, ఎం.అరుణ, లక్ష్మి, జ్యోతి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయండి

పహాడీషరీఫ్: అన్ని విభాగాల సిబ్బంది తమ పని తీరును పూర్తి స్థాయిలో నిర్వర్తించి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని జల్‌పల్లి మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి జి.వెంకట్ నారాయణ సూచించారు. శుక్రవారం ఆయన కమిషనర్ వెంకట్రామ్, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పన్ను వసూళ్లతో పాటు ట్రేడ్ లైసెన్స్ వసూళ్లపై రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలని, వర్షాకాలం దృష్ట్యా ఇంజనీరింగ్ అధికారులు మ్యాన్‌హోళ్ల మరమ్మతులపై, శానిటేషన్ విభాగం పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూసుకోవాలన్నారు. మొక్కలను నాటి సంరక్షించే విషయంలో పర్యావరణ విభాగం, ఆదాయం, వ్యయం విషయాలలో అకౌంట్స్ విభాగం పారదర్శకతను పాటించాలని స్పెషల్ ఆఫీసర్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్వో జ్యోతిరెడ్డి, ఈఈ ఇష్రత్ ఆయేషా, మేనేజర్ అర్షద్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మోయిన్ బాబా తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ సిబ్బందితో సమీక్ష జరుపుతున్న ప్రత్యేకాధికారి వెంకట్ నారాయణ

ఓటు చోరీపై ఆందోళన తీవ్రతరం

దిల్‌సుఖ్‌నగర్: ఓటుచోరీపై ఆందోళన కార్యక్రమాలు తీవ్రం చేస్తామని టీపీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో ఓట్ చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేప భాస్కర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఓట్ చోరీపై రాహుల్‌గాంధీ చేపట్టిన ఆందోళనకు మద్దతుగా మహేశ్వరం నియోజకవర్గంలో ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, గట్ల రవీంద్ర, ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మన్ సురేష్ పాల్గొన్నారు.

వర్షం.. పంటలు ఆగం

- జాగ్రత్తలతో నష్ట నివారణ
- క్రిడా నిపుణుడు శ్రీకృష్ణ



కందుకూరు: తీవ్ర వర్షాలలో పంటలను రక్షించుకునేందుకు కృషి విజ్ఞాన్ కేంద్రం జిల్లా క్రిడా నిపుణుడు శ్రీకృష్ణ రైతులకు సలహాలు సూచనలు అందించారు.

సాధారణ చర్యలు

- పంట పొలాల్లో నీరు నిలువ ఉండకుండా సరైన డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి.
- వర్షం సమయంలో పొలంలో పని చేయవద్దు.
- వర్షం తర్వాత కాపర్‌ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లీటర్ నీటికి లేదా మ్యాంకోజెబ్ రెండు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- వర్షం తర్వాత 0.5 శాతం పొటాషియంనైట్రేట్ లేదా 19:19:19 ఒక శాతం పంటపై పిచికారీ చేయాలి.

కూరగాయాలకు..

- టమాటో, మిరప, వంగ తోటల్లో అధిక నీటిని బయటికి తొలగించాలి. ట్రైకోడెర్మావిరిడి ఉపయోగించాలి.
- నత్రజని ఎరువులు వాడటం వాయిదా వేయాలి.
- తీగజాతి కూరగాయల(సొర, బీర, దోసకాయ, గుమ్మడి, కాకర) పంటలను ఎత్తైన బోదెలపైన పెంచాలి.
- కార్బెండజిమ్ లేదా మ్యాంకోజెబ్ పిచికారీ చేయాలి.

పండ్ల తోటలు..

- జామ పంటలో పాదుల్లో నిలువ నీటిని తొలగించాలి, కుళ్లిన కొమ్మలను కత్తిరించి బోర్డోపేస్టుతో రక్షించాలి. వర్షం తర్వాత జింక్‌సల్ఫేట్, యూరియా పిచికారీ చేయాలి.
- మామిడి పంటలో నీరు నిలువ ఉండకుండా చూడాలి. ట్రైకోడెర్మావిరిడి, పశువుల ఎరువు ఉపయోగించాలి. 0.5శాతం పొటాషియం నైట్రేట్ పంటపైన పిచికారీ చేయాలి.
- బొప్పాయి పంటలో మొదలు ప్రాంతంలో నీరు నిలువకుండా చూసుకోవాలి. కాపర్‌ఆక్సీక్లోరైడ్ పిచికారీ చేయాలి. ట్రైకోదర్మా, వేప పొడి పాదులో వేయాలి.

పూల పంటలు

- చామంతి. బంతి పంటపై మ్యాంకోజెబ్ లేదా కాపర్‌ఆక్సీక్లోరైడ్ పిచికారీ చేయాలి. ట్రైకోడెర్మా విరిడి పాదులో వేయాలి.



- లిల్లీ పంటలో నిలువ నీరు తొలగించాలి. భూమిలో కార్బెండజిమ్ వేసుకోవాలి. పైపాటుగా జింక్‌సల్ఫేట్, యూరియా పిచికారీ చేయాలి.

వర్షం తర్వాత పునరుద్ధరణ

- బయోఫర్టిలైజర్స్(అజోస్పిరిల్లం, ఫాస్ఫోబ్యాక్టీరియా) వేర్ల పునర్ధురణ కోసం వాడాలి.
- 19:19:19(1శాతం) లేదా 0.5 శాతం పొటాషియంనైట్రేట్ పంటపై పిచికారీ చేయాలి.
- పొలాలు ఆరిన తర్వాత సాధారణ ఎరువులు ఉపయోగించాలి.
- పొలాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- మొదట ఎక్కువ ఉన్న నీటిని తొలగించాలి. భూమిని జీవశిలీంద్రనాశినితో రక్షించాలి, వర్షం తర్వాత పైపాటుగా పోషకాలతో పిచికారీ చేసి పంట పునురుద్ధరణ చర్యలు చేపట్టాలి.



వనస్థలిపురం రత్నదీప్ సూపర్ మార్కెట్ ఎదుట..


పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్డుపై వాహనాల పార్కింగ్

రోడ్డుపైనే పార్కింగ్.. ఇదేం చోద్యం

ట్రాఫిక్ సుడిగుండంలో వనస్థలిపురం

- వ్యాపార సముదాయాల ముందు రోడ్లపై వాహనాల పార్కింగ్
- పోలీస్ స్టేషన్ వద్ద కూడా ఇదే పరిస్థితి
- ట్రాఫిక్‌జాంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

వనస్థలిపురం: వాణిజ్య పరంగా దినదినాభివృద్ధి చెందుతున్న వనస్థలిపురంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయి. వనస్థలిపురం ప్రధాన రహదారులలో పేరొందిన కంపెనీలకు చెందిన షోరూంలు, సూపర్ మార్కెట్లు, కార్పొరేట్ కళాశాలలు, స్కూళ్లు, బ్యాంకులు, హోటళ్లు, పలు వాణిజ్య సముదాయాలు ఏర్పడడంతో రద్దీ ప్రాంతాలుగా మారాయి. అయితే వాణిజ్య సముదాయాలు, సూపర్ మార్కెట్లు, బ్యాంకులకు సరైన పార్కింగ్ వసతి లేకపోవడంతో వాటి వినియోగదారులు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ఆ దారిన వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు విజయవాడ జాతీయ రహదారి, నాగార్జునసాగర్ రహదారులపై చలాన్లు రాయడానికి పరిమితం అవుతున్నారు తప్ప వనస్థలిపురంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

- వనస్థలిపురం ప్రధాన రహదారిలో ఉన్న పోలీసుస్టేషన్‌కు వచ్చేవారు, సిబ్బంది తమ వాహనాలను రోడ్డుపైనే రెండు వరుసల్లో పార్కింగ్ చేస్తుండడంతో రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ వద్ద ఇదే పరిస్థితి. బ్యాంకుకు వచ్చే ఖాతాదారులు బ్యాంకుకు సరైన పార్కింగ్ వ్యవస్థ లేకపోవడంతో తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌జాంలు తప్పడం లేదు.
- ప్రధాన రహదారిపై ఉన్న రత్నదీప్ సూపర్ మార్కెట్‌కు వచ్చిన కస్టమర్లు రోడ్డుపై, పక్కనే ఉన్న కాలనీ అంతర్గత రోడ్డుపై తమ వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో వాహనదారులు, కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.
- వనస్థలిపురం గణేష్ టెంపుల్, షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాలలో వాహన దారులు తమ వాహనాలను విచ్చలవిడిగా రోడ్డు వెంబడి పార్కింగ్ చేస్తుండడంతో ఆ దారిన వెళ్లే వాహనదారులు, ఆర్టీసీ బస్ డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు.
- వనస్థలిపురం గణేష్ టెంపుల్ నుంచి బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా వరకు రాత్రి వేళ నిత్యం ట్రాఫిక్ జాంలు ఏర్పడుతున్నాయి. ఆయా వ్యాపార సంస్థల ముందు వాహనదారులు తమ వాహనాలను అడ్డగోలుగా పార్కింగ్ చేస్తుండడంతో రోడ్డు కుంచించుకుపోయి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.


గణేశ్ టెంపుల్ ప్రధాన రహదారిలో రాత్రివేళ ట్రాఫిక్‌జాం

జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలి..

రోడ్డుపై సరైన పార్కింగ్ సదుపాయం లేని సూపర్ మార్కెట్లు, వ్యాపార సముదాయాలకు నోటీసులు ఇచ్చాం. వనస్థలిపురంలోని రత్నదీప్ సూపర్ మార్కెట్ వారికి కూడా నోటీసులు ఇచ్చాం. ఈ విషయమై జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. పార్కింగ్ సదుపాయం లేని వాణిజ్య సంస్థల మూసివేతకు వారు చర్యలు తీసుకోవాలి. మేము రోడ్డుపై పార్కింగ్ చేసిన వారికి మాత్రమే చలాన్లు వేయగలం)

–గట్టుమల్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, వనస్థలిపురం

ప్రారంభంలో గుర్తిస్తే మందులతో నయం

మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

మీర్‌పేట: ప్రారంభ దశలోనే ప్రాణాంతక కేన్సర్‌ను నిర్ధారిస్తే మందులతో నయం చేయవచ్చని మాజీ ఎమ్మెల్యే, టీకేఆర్ విద్యాసంస్థల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీర్‌పేటలోని టీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీకేఆర్ మాట్లాడుతూ.. చిన్న పిల్లల నుంచి పెద్ద వారి దాకా కేన్సర్ మహమ్మారి భారిన పడుతున్నారన్నారు. ముందుగానే గుర్తించి సరైన చికిత్స తీసుకోవాలని సూచించారు. ఉచిత శిబిరం ద్వారా 500 మందికి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించామన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ హరినాథ్‌రెడ్డి, కోశాధికారి అమర్‌నాథ్‌రెడ్డి, కేన్సర్ స్క్రీనింగ్ సెంటర్ హెచ్ఓడీ కృష్ణప్రసాద్, డా.ప్రభాకర్, రేడియాలజీ డాక్టర్ రేణుక, ప్రవళిక, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ సునీత పాల్గొన్నారు.


కేన్సర్ స్క్రీనింగ్ సెంటర్‌ను ప్రారంభించి పరీక్షలు చేయించుకుంటున్న టీకేఆర్

వ్యక్తి అదృశ్యం

చైతన్యపురి: అపార్టుమెంటులో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి అదృశ్యం అయ్యాడు. చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన మేరకు.. తూర్పు గోదావరి రాజంపూడికి చెందిన కర్నాటి రాంబాబు, కుమారి దంపతులు కొత్తపేటలో ఉంటున్నారు. సత్యానగర్ కాలనీలోని ఓ అపార్టుమెంటులో రాంబాబు వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య కుమారి బట్టల దుకాణంలో స్వీపర్‌గా పనిచేస్తోంది. కొన్ని రోజులుగా రాంబాబు మద్యం తాగుతుండటంతో గురువారం భార్య కుమారి మందలించింది. తరువాత పనిలోకి వెళ్లింది. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా రాంబాబు కనిపించలేదు. చుట్టు పక్కల వెతికినా అతని జాడ తెలియకపోవటంతో శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

బొడ్రాయి పూజలో ఎమ్మెల్యే

హయత్‌నగర్: హయత్‌నగర్‌లో జరుగుతున్న బొడ్రాయి(నాభిశిల) ప్రతిష్ఠాపన ఉత్సవాలలో బాగంగా శుక్రవారం బొడ్రాయి జలాభిషేకం కార్యక్రమం వైభవంగా జరిగింది. వేల సంఖ్యలో మహిళలు బొడ్రాయికి జలాభిషేకం చేశారు. గ్రామంలోని గ్రామ దేవతల గుళ్ళను సంప్రోక్షణ చేసి అలంకరించారు. స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కళ్ళెం నవజీవన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.


బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

బాలింతలు,గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


అంగన్వాడీ కేంద్రంలో సీమంతం చేస్తున్న అధికారులు

దిల్‌సుఖ్‌నగర్: బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సావిత్రి సూచించారు. ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ లో శుక్రవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. సావిత్రి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా పౌష్టికాహారాన్ని అందిస్తున్నాయని ఆమె వివరించారు. అంగన్వాడీ టీచర్లు గంగ, సునీత పాల్గొన్నారు.